క్లుప్తంగా

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని చెప్పారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

నెహ్రూనగర్: గుంటూరు 2 డిపో పరిధిలో నేడు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డిపో మేనేజర్ కార్యాలయంలో గుంటూరు– హైదరాబాద్, గుంటూరు– తెనాలి, గుంటూరు– విజయవాడ, గుంటూరు – విశాఖపట్నం రూట్‌లలో తిరుగుతున్న బస్సుల గురించి, సిబ్బంది తీరు గురించి ప్రయాణికులు, విద్యార్థినులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

రేపటి నుంచి పట్టభద్రుల ఓటు నమోదు

నెహ్రూనగర్: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా క్యాంపు కార్యాలయం వద్ద జరుగుతుందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆదివారం తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంగళదాస్‌నగర్ 3వ లైనులోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

ట్రైసైకిళ్లు పంపిణీ



నగరంపాలెం: స్థానిక కొత్తపేట డీఎస్ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం దోగిపర్తి సుబ్బారావు జయంతిని పురస్కరించుకుని సుమారు వంద మందికి దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇరవై మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో దోగిపర్తి అనంత సాంబశివరావు, శివమోహనరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

అలరించిన మహతీ స్వరసుధ సినీ సౌరభాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై ఆదివారం సాయంత్రం సినీ సౌరభాల కార్యక్రమం నిర్వహించారు. మహతి స్వరసుధ వ్యవస్థాపక అధ్యక్షురాలు పత్రీ నిర్మల ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయని, గాయకులు రాజ్యలక్ష్మి, అన్నపూర్ణ, ముకుంద ప్రియ, లక్ష్మి, కృష్ణ, నాగవల్లి, విజయశ్రీ, ప్రద్యుమ్న, వీరయ్య, సాయిబాబా, ఈశ్వరరావు తదితరులు అలనాటి సినీ సౌరభాలను వీనుల విందుగా ఆలపించారు. కీబోర్డ్‌పై ప్రసాద్, తబలాపై వెంకట్, పాడ్స్‌పై ప్రసాద్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్ వ్యాఖ్యానం చేయగా, కె.మదన్‌మోహనరావు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేయాలి

పొన్నూరు: బీజేపీ అనుసరిస్తున్న విభజన, విద్వేష రాజకీయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం పొన్నూరు యూటీఎఫ్ కార్యాలయంలో ఎన్.రమేష్‌బాబు అధ్యక్షతన సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక వెంటనే అందుబాటులోకి తేవాలని, పంట నష్టపోయిన రైతులు అందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. చిరు ఉద్యోగులను రాజకీయ కారణాలతో తొలగించడాన్ని ఆపాలని డిమాండ్‌చేశారు. విశాఖ ఉక్కు కాపాడుకోవడానికి పార్టీలకతీతంగా పోరాట కమిటీని ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. అనంతరం సీపీఎం పొన్నూరు శాఖ కార్యదర్శిగా గోనిగల ప్రభుదాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఇసుక అందుబాటులోకి తేవాలని అక్టోబర్ 4న జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.

రేపు వయోవృద్ధుల దినోత్సవం

తెనాలి: పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆరోజు ఉదయం 9.30 గంటలకు ఏర్పాటయ్యే సభకు సంఘం అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ హాజరవుతారు.

వీధి కుక్కలపై ప్రత్యేక దృష్టి



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

- ప్రతి రోజూ వందకు తగ్గకుండా ఏబీసీ ఆపరేషన్లు
- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఏబీసీ సెంటర్‌లో ప్రతి రోజు వందకు తగ్గకుండా వీధి కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సర్జరీలు చేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన చర్యలు సదరు కాంట్రాక్ట్ సంస్థ చేపట్టాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం ఏటుకూరు రోడ్‌లోని ఏబీసీ సెంటర్, వర్మీ కంపోస్ట్ యూనిట్, వెంగళాయపాలెంలోని గోశాలలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. తొలుత ఏబీసీ సెంటర్‌లోని ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్ అనంతరం కుక్కలను ఉంచుతున్న ప్రాంతాలు, వాటికి అందిస్తున్న ఆహారం, చికిత్స విధానాలను డాక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తెస్తున్న కుక్కలు, ఆపరేషన్ చేసిన కుక్కల వివరాలను రిజిస్టర్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కలపై నియంత్రణపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి నియంత్రణకు ఏటుకూరు రోడ్‌లోని ఏబీసీ సెంటర్‌లో స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తుందన్నారు. ప్రతి రోజు వంద కుక్కలకు ఆపరేషన్లు జరిగేలే ఏజెన్సీ తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. అందుకు తగిన విధంగా మౌలిక వసతులను జీఎంసీ కల్పిస్తుందన్నారు. ఆపరేషన్ జరిగిన కుక్కలకు నిర్దేశిత సమయం వరకు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, తగిన చికిత్స, ఆహారం అందించాలని కోరారు. ఏబీసీ సెంటర్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నగరంలో ఏ వీధిలో నుంచి తెచ్చిన కుక్కలను ఆపరేషన్ అనంతరం అదే వీధిలో విడిచి పెట్టాలని కోరారు. వర్మీ కంపోస్ట్ యూనిట్‌ని పరిశీలించి, నగరంలోని జీఎంసీ పార్క్‌లో, డివైడర్‌ల మధ్యలోని మొక్కలకు అందించాలని ఆదేశించారు. కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించి, నగరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్ ప్రాజెక్ట్‌కి తరలించాలన్నారు. అనంతరం వెంగళాయపాలెంలోని గోశాలను పరిశీలించి, ఎన్ని ఆవులు ఉన్నదీ, వాటికి అందిస్తున్న ఆహార వివరాలు అడిగి తెలుసుకొని, పరిసరాలు బురదగా ఉండడం గమనించి ప్రాంగణం ఫ్లోరింగ్ చేయడానికి, నూతన షెడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ డి.రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, ఆనందకుమార్, రాంబాబు, డీఈఈ సతీష్, ఏసీపీ మురళీ, టీపీఎస్ సువర్ణ కుమార్, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దాసరి ఏడుకొండలు, మల్లికార్జునరావు, స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే కథల పోటీలు



కథలు రాయడంలో నిమగ్నమైన విద్యార్థులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, ఊహాశక్తిని పెంపొందించేందుకే కథల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో ఆదివారం పాఠశాల స్థాయి విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కథలు రాసేందుకు విద్యార్థులు ఉత్సాహంగా తరలిరావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు రాసిన కథల నుంచి ఎంపిక చేసిన కథలను గుంటూరు జిల్లా పిల్లల కథలు పేరుతో విద్యార్థి పేరు, ఫొటో, పాఠశాల, తల్లిదండ్రుల పేర్లతో పుస్తకాన్ని ముద్రిస్తామని వివరించారు. ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, మేధాసక్తిని పెంపొందించేందుకు జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కథల పోటీలు నిర్వహించడం మంచి విషయమన్నారు. ఈసందర్భంగా ప్రజా గాయకుడు పీవీ రమణ బాల్యం ఆట, పాటలకు దూరమవుతున్న తీరును వివరిస్తూ ఆలపించిన పాట ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో బాల సాహిత్యవేత్త హకీం జానీ, ఎస్ఎం సుభానీ, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ఏఎస్ ప్రసాద్, టి.జాన్‌బాబు, బి. ప్రసాద్, బి.శంకర్‌సింగ్, ఆర్. స్వాతి, ఇ. రాధ, టీఆర్ రమేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో హిమోఫీలియా కేర్ సెంటర్ ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో హిమోఫోలియా కేంద్రాన్ని ఆదివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద రోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 1100 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారని వారందరికి సంపూర్ణ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వెల్లడించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ రక్త స్రావంతో బాధపడే వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హిమోఫిలియా సొసైటీ కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్ పాల్గొన్నారు.



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

అరుదైన వ్యాధికి ఖరీదైన చికిత్స...

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో గత నెలలో జి.నాగదుర్గ అనే రోగి అరుదైన వ్యాధితో ఆస్పత్రిలో చేరినట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. రోగికి శరీరంలో ఎక్కడైనా దెబ్బ తగిలిన, ఆపరేషన్ చేసిన సమయంలో రక్త స్రావం ఎక్కువగా అవుతుందని వెల్లడించారు. ల్యాప్రోస్కోపితో కుడి వైపు అండాశయంలో ఉన్న ట్యూమర్‌ను తొలగించామన్నారు. దాదాపు రూ.కోటిన్నర వ్యయంతో పేషంట్‌కు చికిత్స అందించామని తెలిపారు.

గుండె జబ్బులపై అవగాహన ఉండాలి



గుంటూరు మెడికల్: వయస్సుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలని హోప్ విన్‌హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. ఆదివారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్థానిక ఎన్జీఓ కాలనీలోని డాక్టర్ రంజన్ బాబు కార్డ్స్ గ్రూప్‌లో ప్రథమ చికిత్సపై డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక వస్త్రైలి వల్ల నేడు గుండెజబ్బులు బాగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఆర్ చేసే మానేక్విన్, మాస్కులు హాస్పిటల్ తరపున విద్యార్థులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గణేష్, కాలేజీ డైరెక్టర్ సత్యవతి పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లతోనే గుండె పదిలం

డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి

లక్ష్మీపురం: స్థానిక ఓల్డ్ క్లబ్ రోడ్డులోని కారుమూరి హాస్పిటల్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి సహకారంతో అవగాహన సంస్థలో ఆదివారం వరల్డ్ హార్ట్ డేని పురస్కరించుకుని ఆరోగ్య సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ నూతన జీవన అలవాట్ల వలన గుండె జబ్బులకు గురవుతున్నారని చెప్పారు. డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గుండె వ్యాధులపై అవగాహన కల్పించేందుకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, వరల్డ్ హార్ట్ డే పాటిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా వ్యాయామం లేకపోవడం, అనారోగ్య ఆహార అలవాట్ల వలన గుండెకు సంబంధించిన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. అనంతరం కారుమూరి హాస్పిటల్ యాజమాన్యం, అవగాహన సంస్థ సంయుక్తంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను సన్మానించారు.



మాట్లాడుతున్న తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, వేదికపై కారుమూరి శ్రీనివాస్ రెడ్డి

గుండె జబ్బులపై అవగాహన వాక్‌థాన్



గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు పెరిగిపోతున్న నంబర్ వన్ కిల్లర్ డిసీజ్ గుండెజబ్బుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రేష్ఠ హాస్పిటల్స్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ జి.నాగార్జున అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లోని శ్రేష్ఠ హాస్పిటల్‌లో గుండె ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కోసం వాక్‌థాన్ నిర్వహించారు. వాక్‌థాన్‌ను ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ వై.లక్ష్మణస్వామి ప్రారంభించారు. గుండెజబ్బు వైద్య నిపుణులు నాగార్జున మాట్లాడుతూ గుండె ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారంలో కనీసం ఐదు రోజులపాటు ప్రతిరోజూ అరగంటసేపు వ్యాయామం చేయాలన్నారు. ఒత్తిడి లేకుండా చూసుకోవాలని, బీపీ, షుగర్‌లు నియంత్రణలో ఉండాలని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, హార్ట్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రూ.1,499కే ప్రత్యేక హార్ట్ ప్యాకేజీ, అక్టోబర్ 9 వరకు అమల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుస్మిత, డాక్టర్ హేమసుందర్ పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో అధికంగా గుండె జబ్బులు

గుంటూరు మెడికల్: జీవనశైలిలో మార్పుల వలన అధికంగా గుండె సంబంధిత వ్యాధి కేసులు నమోదు అవుతున్నాయని లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ పోలవరపు అన్నారు. యువతలో గుండెజబ్బు మరణాలు చోటు చేసుకోవటం చాలా బాధాకరమని పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం గుంటూరు కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ అనురాగ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణం హార్ట్ డీసీజెస్ అని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి ఏడాది 17.7 మిలియన్ల మరణాలకు హృదయ సంబంధిత వ్యాధులు కారణమవుతున్నాయని తెలిపారు. గుండెజబ్బు ఉందని తెలియకుండానే చాలా మరణాలు ఆకస్మాత్తుగా సంభవిస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదికి ఒకసారి హార్ట్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవటం ద్వారా గుండె జబ్బులను నివారించవచ్చని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పైగా బీపీ,షుగర్, ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు ఉచితంగా చేసి వైద్య సలహాలు అందజేసినట్లు సీనియర్ కార్డియాలజిస్ట్ లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఫణి, మాధురి, వరప్రసాద్, సంగ్రామ్‌సింగ్, ఫణిరాజ్, ఇందు, జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అనురాగ్

లంక గ్రామాల్లో 'మానవత' సేవలు స్ఫూర్తిదాయకం



ఆర్థిక సాయం అందించిన సభ్యులతో కొత్త సుబ్రహ్మణ్యం, రామ్‌చంద్

రీజినల్ చైర్మన్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి: వరద బాధిత లంక గ్రామాలకు మానవత స్వచ్ఛంద సంస్థ అందించిన సాయం స్ఫూర్తిదాయకమని రీజినల్ చైర్మన్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కేవలం వాట్సాప్ సందేశానికి స్పందించి రూ.5 లక్షల సాయం అందించిన సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. మానవత సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో నిర్వహించారు. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సభ్యత్వం వెయ్యికి పైగా చేరేలా ముందుకు వెళదామని చెప్పారు. మానవత సంస్థకు కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు, మహిళా సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. డాక్టర్ రామ్‌చంద్ మాట్లాడుతూ తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లోని కృష్ణా తీరంలోని 12 లంక గ్రామాలకు చెందిన 950 బాధిత కుటుంబాలకు రూ.700 చొప్పున నిత్యావరాల కిట్‌ను, మరో 500 కుటుంబాలకు పొద్దుటూరు శాఖ సమకూర్చిన దుప్పట్లతో టవల్‌ను కలిపి పంపిణీ చేసినట్టు డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు. ఆర్థికసాయం అందించిన సభ్యులకు జ్ఞాపికలను బహూకరించారు. డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి మాట్లాడుతూ సంస్థ తరపున ఆరోగ్య శిబిరాల నిర్వహణను సూచించారు. ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్ ప్రతి ఒక్కరూ మరొకరిని సభ్యుడిని చేర్పించాలని కోరారు. గుంటూరుకు చెందిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ హెచ్ఐవీ బాధిత చిన్నారులకు నెలనెలా అందిస్తున్న పౌష్టికాహార వితరణలో పాలుపంచుకోవాలని ట్రస్ట్‌కు చెందిన రమేష్, కుర్రా శ్రీను విజ్ఞప్తిచేశారు. ఇంటర్మీడియెట్ విద్యార్థిని తుళ్లూరి తేజస్వినికి కూరపాటి రవీంద్రనాథ్, కళ్యాణి దంపతులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఆమె తల్లికి అందజేశారు. డిగ్రీ సెకండియర్ విద్యార్థి వలవరపు జనార్ధనరావుకు రూ.12 వేలను సంస్థ తరపున అన్నాబతుని శ్రీధర్ అందజేశారు. సమావేశంలో పి.వెంకట్, ముత్తేవి రవీంద్రనాథ్, పరిమి వాసు, డీవీ సోమయ్యశాస్త్రి, ఎస్‌వీ శర్మ, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, రోహిణి పాల్గొన్నారు.

నేనూ రైతు కుటుంబం నుంచే వచ్చాను..

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



పుల్లడిగుంటలో రైతులకు దాణా అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ప్రత్తిపాడు: వ్యవసాయం లేకపోతే మనం తినడానికి ఏమీ ఉండదని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటకు చెందిన దివంగత జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా పాడి రైతులకు దాణా, వ్యవసాయ రైతులకు పురుగు మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ చేతుల మీదుగా రైతులకు దాణా, పురుగు మందులు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ చాలా మంది వ్యవసాయం మరిచి పోవడంతో రియల్ ఎస్టేట్ వచ్చి కట్టడాలు కడుతున్నారన్నారు. అయినప్పటికీ రైతులు ఉండబట్టి ప్రపంచమంతా హ్యాపీగా బతుకుతున్నారని చెప్పారు. అలాంటి రైతులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. నేను కూడా ఒక రైతు కుటుంబం నుంచి వచ్చానని, ఇది చెప్పుకోవడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

అందరూ కలిసిమెలిసి ఉండాలి..

గ్రామాల్లో అందరూ కలిసి మెలిసి ఉండాలని ఎస్పీ అన్నారు. గొడవలు, సమస్యలు వచ్చినప్పుడు ఎస్ఐ, సీఐ, ఎస్పీ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. రాజకీయమనేది ఓటు వెయ్యడం వరకే ఉండాలని, ఓటు అనేది మీ హక్కని, అంతేగానీ దాన్ని ఆధారంగా చేసుకుని గొడవలు చేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఉప్పుటూరి చిన రాములు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ పరిహారం అందించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి

లక్ష్మీపురం: ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతు, కౌలు రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంకా జిల్లాలోని అనేక ప్రాంతాలలో పరిహారం అందలేదంటూ రైతాంగం ఆందోళన చెందుతుందన్నారు. ఎకరానికి రూ.15 నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టిన కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. జిల్లాలో పంట దెబ్బతిన్న ప్రాంతాలను సీపీఐ, రైతు సంఘం రాష్ట్ర నాయకత్వంతో పాటు కేరళ ఎంపీ సంతోష్‌కుమార్ కూడా సందర్శించి ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు ముప్పాళ్ళ శివశంకర్ రావు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

లక్ష్మీపురం: మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం నగరంపాలెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు.. డీఎస్ నగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన గుర్రపుశాల సుందరరావుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పవన్‌కుమార్ మతిస్థిమితం లేక చికిత్స పొందుతున్నాడు. అయితే ఈనెల 15వ తేదీన నగరంపాలెంలోని చర్చికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తమ్ముడు అనిల్‌కుమార్ లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా దారి తప్పిపోయిన పరిధి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో వస్తుందని చెప్పడంతో తిరిగి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తప్పిపోయిన కేసు నమోదు చేశారు. ఆచూకి తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ సలాం 8688831340కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

తప్పిపోయిన వృద్ధుడు...

వృద్ధాప్యంలో ఉన్న ఓ మతి స్థితిమితం లేని వ్యక్తి రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు.. అంకమ్మనగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన చిట్టిరాల వెంకయ్య వయస్సు 64 గత కొంత కాలంగా మతి స్థిమితం లేక చికిత్స పొందుతూ ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈనెల 28 శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల పరిశీలించి ఎంతకు కనిపించక పోవడంతో వృద్ధుడు వెంకయ్య కుమారుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకి తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ సలాం 8688831340కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు యువకులు ఆత్మహత్య

నగరంపాలెం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళదాస్ నగర్ రెండో వీధికి చెందిన బి.ప్రసన్న, మాణిక్యరావు(34) భార్యాభర్తలు. వీరికి కుమారుడు. మాణిక్యరావు పెయింట్ పనులకు వెళ్లేవాడు. అతడి అమ్మ జయమ్మకు అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రిలో చూపించాడు. అయితే తల్లికి చికిత్స నిమిత్తం సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. ఈ క్రమంలో చిలకలూరిపేటలో భార్య పేరుపై ఉన్న టిడ్కో ఇల్లు తనఖా పెట్టాలనే భార్యతో గొడవ పడ్డాడు. శనివారం రాత్రి భార్య కుటుంబ సభ్యులు వచ్చి మాణిక్యరావుతో గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన అతను ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్షలు నిమిత్తం జీజీహెచ్ శవాగారానికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి...

చున్నీతో ఉరేసుకుని ఒకరూ మృతిచెందారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటుకూర్ రోడ్డు దర్గా మాన్యంకు చెందిన యు.నాగేశ్వరరావు (33)తో కొల్లిపరకు చెందిన తిరుపతమ్మకు 2013 లో వివాహమైంది. వీరికి కుమార్తె. భార్యాభర్తల మధ్య కుటుంబ విభేదాలు వచ్చి వేర్వేరుగా ఉంటున్నారు. కూలీ పనులకు వెళ్లే నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీ తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మృతిపై భార్య ఆదివారం లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'నవరసాల నటుడు నందమూరి' శతక పుస్తకావిష్కరణ

తెనాలి: బెంగళూరులోని సీపీ బ్రౌన్ సేవా సంస్థ నిర్వహించిన విశ్వ శతక స్పర్ధలో తృతీయ బహుమతిని అందుకున్న 'నవరసాల నటుడు నందమూరి' శతక పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక కొత్తపేటలోని కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో డీఎల్ కాంతారావు సమావేశపు వేదికపై జరిగిన సభకు విశ్రాంత ప్రిన్సిపాల్ జి.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రాయప్రోలు జగదీశ చంద్రశర్మ రచించిన శతక పుస్తకాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు.

కూటమి ప్రభుత్వంలో దళితులకు తీవ్ర అన్యాయం

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వంలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ముఖ్యంగా ఇటీవల విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల్లో దళితులను పూర్తి స్థాయిలో విస్మరించారని దళిత యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొత్తూరి విజయ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం గుంటూరు ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడిన ప్రభుత్వంలో బీజేపీ నాయకులను పట్టించుకుంటున్న పాపన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భగవాన్‌దాస్‌కు నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని ప్రస్తుత బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సిఫార్సు చేసినా ఫలితం శూన్యమన్నారు. సమావేశంలో ఎం.లక్ష్మణరావు, రాజేష్, కుమారి, రమణ, దుర్గా పాల్గొన్నారు.